పక్షి ఎగిరిపోయింది

రాత్రి తొమ్మిదిన్నర దాటింది ఆ వీధిలో జన సంచారం తగ్గింది. కాని ఊరు మాటుమణిగిపోయాక నిద్రలేచే పట్టాభి భవనం ఆ రోజు నిశ్శబ్దంగా వుంది. అదొక పురాతన మైన పెద్ద యిల్లు. అందులో రకరకాల వాళ్ళు సుమారు పదమూడు కాపురాలు వరకు వున్నాయి. అంతా పనులనించి యింటికివచ్చి రాత్రి తొమ్మిది దాటాక బాతాఖానీ మొదలు పెట్టి చుట్టుపక్కల వాళ్ళ నిద్రని ఖూనీ చేస్తూంటారు. కాని - ఆ రోజు ఆ యింట్లో అన్ని గదుల్లోను దీపాలు వెలుగుతున్నా అందరి మగాళ్ళూ గూటికి చేరుకున్నా ఇంకా నిశ్శబ్దంగా వుండటం ఆశ్చర్యమే !

అమావాస్య వెళ్ళిన మర్నాటి సినీవాలీ అందంగా కత్తిరించిన వెండితీగెలా ఆకాశంలో మెరుస్తున్నాడు.

ఒక్కొక్కరూ ముందున్న పంచలో చేరి, తలో చోట ఉస్సురంటూ కూర్చుంటున్నారు. అందరి మనసుల్లోనూ ఒకటే సమస్య. ఒకటే బాధ - తర్కానికి, చర్చకి ఎవరు ముందు మొదలు పెట్టాలో తెలీని ఒక అయోమయ పరిస్థితి అది.

"నేనిలా జరుగుతుందని ఓ నెల్లాళ్ళ క్రితమే వూహించాను" అంది పార్వతమ్మ - వేడి వేడి నీళ్ళు తెచ్చి భర్త కోసం ఓ పక్కగా పెట్టి.

"అబ్బే నేనసలు అనుకోలేదు. అనుకుంటే ముందే జాగ్రత్తపడి వుండేవాళ్ళం" అంది కనకం నిస్సారంగా.

ఒక్కొక్కరూ ఆడా మగా బయటికి చేరి చర్చ మొదలు పెట్టారు.

ఈ మహాపట్టణంలో ఒక్కసారిగా యిల్లు ఖాళీచేసి పొమ్మంటే ఎక్కడికి పోతాం ? అనేదే అందరి సమస్య — అదే అందరి మనసుల్నీ కలచివేసే బాధ.

"మేము పోము" అనే హక్కు వాళ్ళకి లేదు. వాళ్ళుంటున్న ఆ పెద్ద కొంప వాళ్ళల్లో ఎవ్వరిదీ కాదు. అందరూ అద్దె కట్టి అవసరాన్ని గడుపుకుంటున్న అతిథులే.

పట్టాభి భవనం అంటే ఆ చుట్టు పక్కల పెద్దపేరు. ప్రతి రిక్షావాడికీ తెలుసు. ఏ కిళ్ళీ బడ్డీలో అడిగినా అతి సునాయాసంగా యిల్లుచేరవచ్చు. అదొక మార్వాడి వర్తకుడి యిల్లు. అందులో ఎన్నో గదులు - వసారాలు, స్నానాల గదులు, మరుగు దొడ్లూ - ఇంటికి రెండువైపులా పెద్ద బావులు-పెద్దపెట్టున వున్నాయి. ఆ యింట్లోకి ప్రవేశించటానికి ఎవరైనా ముందు కాస్త కంగారు పడతారు. ఎటు వెడితే ఏ గదిలోకి వెళ్తామో, ఎటు మెట్లు ఎక్కితే ఏ వసారా చేరుకుంటామోనని అనుమానం వస్తుంది. ఆ మార్వాడి ఎప్పుడూ

ఆ ఇంటిని గురించి పెద్దగా పట్టించుకోలేదు. ఎప్పుడో అద్దెలకి యిచ్చేసి వూరుకున్నాడు. అతని దగ్గర వుండే ఓ గుమాస్తా మాత్రం ప్రతినెలా వచ్చి అద్దె వసూలు చేసుకుపోతూ వుంటాడు. అతను ఖచ్చితంగా వున్నా కరకుమనిషి కాక పోవడం వల్ల ఓనరుకి అద్దెలు పెంచమని దుర్బోధ చెయ్య లేదు. దీనిమీద పెద్దగా దృష్టిలేని ఆ మహానుభావుడు అద్దెలు పెంచనూ లేదు. అందుకే అట్టడుగు తరగతి, మధ్య తరగతికీ మధ్యన వేలాడుతూ రెక్కాడితేగాని డొక్కాడని కొన్ని కుటుంబాలు అక్కడ చవుక అద్దెలో తలదాచుకుంటున్నాయి.

ఆ రోజు ఉదయమే ఆ గుమాస్తా వచ్చి మార్వాడి యిల్లు ఎవరికో అమ్మేశాడనీ, అందుకు ఓ నెల్లాళ్ళలో అంతా యిల్లు ఖాళీ చెయ్యాలనీ చెప్పి వెళ్ళిపోయాడు. మర్రిచెట్టు నాశ్రయించుకున్న పిట్టల పాలిట అది తుపాకీ దెబ్బ అయింది.

అంతవరకు దెబ్బలాటలతో, వ్యంగ్యాలతో, అరో పణలతో రాత్రిళ్ళు తగువులాడుకునే ఆ ఇంట్లో వారందరికీ నోటమాట పడిపోయింది. అసలుఒక్కొక్క సందర్భంలో అది ఎవరికివారే తమ యిల్లుగా భావించుకోవడం జరిగేది. ప్రతి వాడూ ఎదుటివాడిని «నీ బాబుగాడి సొమ్మా" అంటూ దబాయించటం పరిపాటిగా జరుతూ వుండేది. కాని యీ రోజు అందరికీ ఆ యిల్లు తామెవ్వరిదీ కాదని, తామక్కడినుంచి వెళ్ళిపోవాల్సిన సమయం ఆసన్నమైందనే చేదు నిజం వాళ్ళ గొంతుకల్లో పచ్చి వెలక్కాయలా అడ్డుపడింది.

శేషమ్మ గదిలో దీపం డిమ్‌గా వెలుగుతోంది. అది పదిహేను కేండిల్ బల్బు, రోజంతా కష్టపడినా కడుపునింపుకోలేని పేదవాడిలా అది శక్తినంతా ధారపోసినా అంతకంటే ఎక్కువ కాంతిని యివ్వలేకపోతోంది.

శేషమ్మ మెల్లిగా లేచింది. ఒళ్ళు తూలింది. కళ్ళు తిరిగాయి. నీరసంగా గోడ పట్టుకుని ఒక్కక్షణం నిలబడింది. గాలివానకి విరిగిపోయిన కొమ్మ చెట్టుని విడిచిపెట్టకుండా కొన వూపిరితో వేలాడుతున్నట్లుంది శేషమ్మ. చావురాదు - బ్రతుకురాదు - ఎన్నాళ్ళగానో ఆ యింట్లో ఆ చివరి గదిలో వంటరిగా, రోగిష్టిగా, లేచిన రోజున లేచి, లేనిరోజున మూలుగుతూ కాలం గడుపుతోంది. అయిదు ఆరు తారీఖుల్లో వచ్చే ఆరవై రూపాయల మనియార్డరు కోసం కాంతి మళ్ళిన గాజుకళ్ళతో ఎదురుచూస్తూ అందులో పదిహేను రూపాయలు ఆ గదికి అద్దె కట్టి, మిగిలిన దానితో రోజూ గంజి కాచుకొంటుంది. మరీ లేవలేకపోతే ఓ పావలా డబ్బులిచ్చి పక్కనే వున్న గవర్నమెంటు హాస్పటల్లో రిక్షాలో దిగుతుంది. శేషమ్మకి ఏం రోగమో ఏ డాక్టరుకీ అక్కడ తెలీదు. అందుకని ఏదో తోచిన మందులిస్తారు, ఖచ్చితంగా ఆమె రోగాన్ని గురించి ఆరోగ్యాన్ని గురించి ఆరా తీసే మనుష్యులు ఆమె వెనుక లేకపోవడంతో, అక్కడెవ్వరూ పెద్దగా పట్టించుకోరు. కొన్నాళ్ళున్నాక అదే సర్దుకుంటుంది శేషమ్మ యింటికొస్తుంది, మళ్ళీ నాలుగు రోజులు బాగానే వుండి, మొదటికొస్తుంది

కన్నకొడుకు వస్తాడని, తనని చూస్తాడని, తనతో తీసుకుపోతాడనీ శేషమ్మ వెర్రి ఆశ. కాని ప్రతి నెలా డబ్బే వస్తుంది, కొడుకు రాడు.

కొడుకు పసివాడుగా వుండగానే మొగుడు చచ్చిపోయాడు. అష్టకష్టాలుపడి పిల్లాడిని పెంచింది. రామయ్యే తండ్రి అంటూ కలవరిస్తూ చూసుకుంది. మిడిమిడి జ్ఞానం వచ్చేసరికి వాడికి తల్లిమీద అనుమానం మొదలైంది. వాళ్ళూ వీళ్లూ 'నీ తల్లి మంచిది కాదు' అనడంతో వాడి మనస్సు విరిగింది. తల్లి శీలాన్ని శంకించడంతో వాడి ఆలోచనలు వక్రమార్గం పట్టాయి. ఇది తెలిసి శేషమ్మ కుమిలిపోయింది. వాడికో రోజు తన నిజాయితీ చెప్పబోయింది. వాడు నమ్మలేదు. కొడుకైనా, మొగుడైనా, తండ్రైనా - వాడు మగాడు. ఆడదాన్ని అవమానించి, అనుమానించే హక్కు వాడికి పుట్టుకతో వున్నట్లు ఒక చీత్కారం చేశాడు. శేషమ్మ మనసు పుటుక్కుమంది. కట్టె తెంచుకున్న నదిలా దుఃఖం పొంగింది. ఆ రోజు మొగుడు చచ్చిపోయిన రోజున కూడా ఏడ్వనంతగా ఏడ్చింది. కొడుక్కి చదువురాలేదు. చదివించే శక్తి తనకి ఎలాగూలేదు. వాడు అక్కడక్కడ తిరుగుతూ గడిపి ఓనాడు వూరు విడిచి వెళ్ళిపోయాడు. వెళ్ళిన రెండు నెలలకి ఉత్తరం ఒకటి రాశాడు. తనని కన్నందుకు నెలకింత డబ్బు పంపుతాననీ, ''నిన్ను తల్చ

కుంటే నాకు ఆడజాతి మీదే అసహ్యం వేస్తోందని" రాశాడు. కొడుకు తనమీద ఏర్పరచుకున్న అకారణమైన అసహ్యానికి శేషమ్మ కుసిళ్ళిపోయింది. ఆమెమనసు దిగులుతో ఎండిపోయింది. శరీరం రోగంతో మోడులా ఐపోయింది. శేషమ్మ నడుస్తుంటే వెదుగుబద్ద కదులుతున్నట్లు, దాన్ని వేదన వెంబడిస్తున్నట్లు వుంటుంది. తోడులేని శేషమ్మకి ఆ పెద్ద కొంపలో ఆ మారుమూల గది నీడనిచ్చింది.

రోగిష్టి శేషమ్మ ఎక్కడికి కదలగలదు ? మరొక ఇల్లు ఎక్కడ వెతుక్కోగలదు ? ఆమె కెవరున్నారు ? ఈ రోగంతో తీసుకునే శేషమ్మకి ఎవరిల్లు ఇస్తారు ? ఒకవేళ ఎక్కడైనా యిల్లు దొరికినా ఆమె అద్దె ఎంతివ్వగలదు ? ఆమె యిచ్చే అద్దెకి పూరికొంప కూడా రాదే ! ఇదొక జటిల సమస్యగా మారి శేషమ్మ కొన వూపిరిని లాగేస్తోంది. అనాధగా మిగిలిపోయిన ఆ స్త్రీ మీద దేవుడికెందుకు దయ రాదా అని చూసినవారంతా బాధపడతారు.

శేషమ్మకి కళ్ళు తిరుగుతున్నాయో, లేక భూకంపం వచ్చి యిల్లే తిరిగిపోతోందో తెలీలేదు. కళ్ళు గట్టిగా మూసుకుంది. ఒళ్ళంతా గడ గడ వొణికి నెమ్మదిగా గోడని పట్టుకున్న చేతులు జారాయి. ఆమె అక్కడే చతికిలబడింది.

అటుగా వచ్చిన పార్వతమ్మ -

కథా నిలయం
శ్రీకాకుళం

"శేషమ్మా, అదేవిఁటలా కూలబడ్డావ్ ? బాగుంది. వంట్లో బొత్తిగా శక్తిలేకుండా పోయిందమ్మా నీకు. ఒక్కత్తివి ఇన్నాళ్ళున్నావు. ఇప్పటికైనా ఆ కొడుక్కి యింత గడ్డి పెడుతూ రాయి, వచ్చి తీసుకెళ్ళమని" అంటూ రెండు చేతులతో శేషమ్మని లేవనెత్తింది.

శేషమ్మ ఆయాసంతో వొగరుస్తూ - నెమ్మదిగా మంచం మీదకి చేరింది. శేషమ్మ అనారోగ్యం పెద్దగా పట్టించుకోకుండా అతి సహజంగా అక్కడినుంచి బయట పడింది పార్వతమ్మ. నాలుగే బొగ్గులు మిగిలిన కుంపటిమీద గ్లాసు మట్టులోకి వున్న కాఫీ పెట్టి, ఆలోచనలో పడింది.

వసారాలోంచి మాటలు వినిపిస్తున్నాయి, తనలాంటి జీవితాలు ఎప్పుడు సుఖపడను ? శేషమ్మ లాంటివాళ్ళు ఎప్పుడు కడతేరను ? అని పార్వతమ్మ మథనపడింది.

ఈ యింట్లోంచి మారిపోవాలంటే ఎక్కడలేని బెంగా, భయం మనసుని చుట్టేస్తున్నాయి. మొగుడు తెచ్చే నూట యాభయి రూపాయిలతోనే యిట్లో గడుస్తుందా ? తనెన్ని విధాల రెక్కలు ముక్కలు చేసుకుంటే ఈ మాత్రంగా నడుస్తోందీ బండి. ఎదురింట్లో తను వంటపని చేస్తోంది. అది ఎదురిల్లు కనుక అటోపని యిటోపని సరిపెట్టుకుంటోంది. వాళ్ళింట్లో ఏమైనా మిగిలినా, యిచ్చినా తెచ్చుకోడానికి నామోషీగా వుండటం లేదు. వాళ్ళొక్క నలభయి రూపాయలిస్తారు. తనింట్లో పని చూసుకుంటూ ఆ పని చెయ్యాలంటే

తాము మరొక చోటకెళ్ళిపోతే ఎలా కుదురుతుంది? అంటే తనకా అవకాశం పోయినట్లే. పోనీ అక్కడే చూసుకుందా మంటే తనేమీ వంటగత్తె కాదు. ఏదో కాలం కలిసిరాక పడేపాట్లు, తనకొచ్చే నలబయి రూపాయలతో పాలూ, బొగ్గులూ గడిపేస్తుంది, ఇప్పుడది ఆగిపోవడమే కాకుండా అద్దె పెరుగుతుంది ఇంత విశాలమైన గది ఇరవై రూపాయిలకి ఎక్కడా దొరకదు.

వెచ్చబడిన కాఫీ చుక్క తీసుకెళ్ళి శేషమ్మ కిచ్చి వచ్చింది పార్వతమ్మ. అనాథులకి, దరిద్రులకి, నిత్య బాధితులకీ దేవుడు చావైనా యివ్వడు అని మరొక్కసారి బాధ పడింది. ఆడదాని బ్రతుకులో అడుగడుగునా గండాలే, అవి గడిస్తే అందలం - లేకపోతే అథఃపాతాళం.

ఈ పార్వతమ్మ పార్వతిగా ఊహ తెలిసినప్పటి నుంచి సుఖం అంటే ఏమిటో ఎరగదు. తన పన్నెండో ఏట తల్లి చచ్చిపోతే, తన కింద నలుగురు పిల్లల్ని పెంచి పెద్ద చేస్తూ నిత్యం వొళ్ళెరుగని పని చేసేది. అప్పటికీ అది బాగోలేదు - యిది బాగోలేదు అని తండ్రిచేత చీవాట్లు తినేది. పెళ్ళి చేసే శక్తిలేక, చెయ్యాలనే ధ్యాసలేక సంసార భారం తన మీద పడితే చదువూ సంధ్యాలేని పార్వతి అక్కడా యిక్కడా కష్టపడి యిల్లు నెట్టుకొచ్చేది. అలాంటి సమయంలో నారాయణతో పరిచయమై అది పెళ్ళిదాకా వచ్చింది. ఆ పెళ్ళికి తండ్రి వొప్పుకోలేదు. వొప్పుకోకపోవటానికి కారణం ఏమీలేదు.

అది పార్వతి స్వంతంగా నిర్ణయించుకోవడం. అదొక్కటే ఆయనకిష్టం లేకపోవటానికి కారణం. కాని పార్వతి అందుకు తల వంచలేదు. తను నమ్ముకున్న నారాయణతో వచ్చేసింది. అయితే పార్వతిని కూర్చోబెట్టి హాయిగా పోషించగల శక్తి అతనికి లేకపోవడంతో పెళ్ళి అయిన నాటినుంచి పార్వతి ఆమె కష్టం ఆమెకి వుండనేవుంది. ఈ దేశంలో చదువుకున్నా, చదువుకోకపోయినా, చేతనైనా కాకపోయినా మగాడి మీద భారాన్ని తోసేసి హాయిగా ఉండే స్త్రీలు తక్కువేమో, ప్రతికష్టంలోనూ ఎక్కువపాలు తనే పంచుకుంది పార్వతి. నలభయి అయిదేళ్ళు దాటినా యీనాటికీ ఇద్దరు పిల్లల కోసం, భర్తకోసం కష్టపడి పనిచేస్తూనే వుంటుంది. అలాంటి పార్వతి యీ రోజు యీ ఇల్లు మారిపోవాలంటే వచ్చే యిబ్బందుల్ని మరచిపోయి ఎలా వుండగలదు? అందుకే నిద్రరాక గుమ్మం మీద కూర్చుని బయట మాటలు వింటోంది.

కనకం విలాసంగా వేరుశనక్కాయిలుకొట్టుకుని తింటోంది. ఆమె మనసులో దిగులుగా వున్నా పైకి మాత్రం నిర్లక్ష్యంగానే కనిపిస్తోంది. రోగిష్టి మొగుడు దొరికినందుకు మొదట్లో ఏడ్చినా లంకంతకొంపలో ఎవ్వ రెవ్వరో వచ్చిపోయే ఆ పెద్ద లోగిలిలో తన వ్యవహారం ఎవ్వరూ పట్టించుకోక పోవడం ఆనందంగానే అనిపించింది. తనకి మాత్రం ఎవరితో ఏముంది? ఒక నరసింహంతో తప్ప. అతని గది తమ గదికి పక్కనే. ఎప్పుడూయిద్దరూఎంతో జాగ్రత్తగా వుంటారు. తీరని తన

కోర్కెలు తీర్చుకోవడమే కాకుండా భర్తకి మందులు, బలానికి హార్లిక్సులు తెప్పించి గుట్టుగా కాపురం నెట్టుకొస్తుంది. అలాంటిది యీ రోజు యిక్కడినుంచి కదిలితే నరసింహం ఏమైపోతాడు ? అతను కనబడకపోతే తనేమైపోతుంది ? ఇంత అనువుగా, యింత గుట్టుగా తనెలా వుండగలదు ? తనీ మాత్రం సుఖంగా వుందని దేవుడు కళ్ళల్లో నిప్పులోసుకుంటున్నాడు అని కనకం దేవుడిమీద మెటికలు విరుస్తున్నట్లు శనక్కాయిలు టపీటపీమని కొడుతోంది. ఆమె ఆలోచిస్తూనే వుంది. ఎలాగైనా నరసింహం తానూ ఒకే యింట్లో వుండేటట్లు ఏర్పాటు చేసుకోవాలి. ఈ విషయం మొగుడితో నెమ్మదిగా, అతనికి అనుమానం రాకుండా చెప్పి వొప్పించాలి. అతను కనుక వొప్పుకుంటే మిగిలిన వాళ్ళేమనుకున్నా తను లెక్కచెయ్యదు. కాని అతను వొప్పుకుంటాడా ? ఆరోగ్యం లేకపోయినా అతని అహంకారానికి లోటులేదు. కాని తను మాత్రం అలా యిలా వదలదు. ఎలాగైనా ఈ సమయంలో తన నోరు మూతపడితే తన సుఖానికే తాళం పడుతుంది.

కనకం ఆలోచిస్తూనే వుంది. పథకాలు వేస్తూనే వుంది.

శేషమ్మ అవస్థపడుతూ, యిల్లెక్కడ వెదుక్కోనా అని ఆయాసపడుతూనే వుంది.

పార్వతమ్మ చెదరిపోతున్న ఆర్థిక పథకాన్ని ఎలా నిలుపుకోవాలా అని ఆరాటపడుతూనే వుంది.

వసారాలో ఆవలింతల మధ్య చర్చ జరుగుతూనేవుంది.

రాత్రి మాత్రం ముందుకు కదులుతూనే వుంది. ఆ రాత్రేకాదు, ప్రతీ రాత్రి అలాగే గడుస్తుంది. ఒక్కొక్కరూ ఎక్కడో ఒక చోట యిల్లు కుదిరిందని ఆ యింట్లోంచి కదులుతూనే వున్నారు. ఇలు బావురుమంటూనే వుంది. బకాసురుడి బలికి ధైర్యంగా వెళుతున్నట్లు ఒక్కొక్క కుటుంబం, బళ్ళ మీద సామాను వేసుకుని ముందుకు కదులుతోంది. మిగిలిన వాళ్ళు వెళ్ళేవాళ్ళకి వీడ్కోలు చెప్తున్నారు.

శేషమ్మ రాసిన రెండు ఉత్తరాలకి కొడుకు దగ్గర్నుంచి జవాబు రాలేదు. కదలలేక మెదలలేక కట్టెముక్కలా పడుంది మంచంలో. జాలిపడి పార్వతమ్మ మొగుడితో అంది.

"పాపం శేషమ్మ. మనతో బాటే ఏదైనా ఒక గది........"

చాల్లే వూరుకో. తనకొకటి దిక్కులేదు మెడకో డోలు అన్నట్లు, "ఆ రోగిష్టి మేళంతో చచ్చిపోతాం" కసిరాడు. పార్వతమ్మ మాట్లాడలేదు. దయాదాక్షిణ్యాలకీ స్తోమత కావాలి. అది లేవని తెలిసి వాటిని మనసు అట్టడుగున సమాధి చేసేసింది. కాళ్ళరిగిపోయేలా యింటికోసం మొగుడు తిరుగుతుంటే మరింకేమీ అనలేక వూరుకుంది. పక్కనే వున్న కోమటికొట్లో బాకీ తీరలేదు. దూరంగా వెళ్ళాలంటే అతను పీకల మీద కూర్చుంటాడు. అమ్ముకుందామన్నా అరకాసు బంగారంలేదు. అడుక్కుతినే బ్రతుకు కాదు. పరిష్కారమయ్యే సమస్యలూ కావు అని వుస్సురంది పార్వతమ్మ మనసు.

*　　*　　*

రోజులు గడుస్తున్నాయి. గడువురోజు ముందు కుకుకు తోంది. రెండుసార్లు గుమాస్తావచ్చి గుర్తుచేసి వెళ్ళాడు. ఇంటిని కొనుక్కున్న సాయిబు యిల్లు చూసి పగలకొట్టించి పెద్ద హోటల్ నిర్మించబోతున్నట్లు చెప్పి వెళ్ళాడు.

ఆరోగ్యం పూర్తిగా చెడిపోయిన శేషమ్మ గుండెల్లో గుబులు మరీ ఎక్కువైంది, తను ఒక్క అడుగు కదల్లేదు. గడువు ఒక్కరోజు వుంది. తను కదలనంటే సామాను బయట పడేస్తారు. తన అనారోగ్యం కూడా నటనేనంటారు. తనెంత అవమానాన్ని ఎదుర్కోవాలో వూహించి కరగిపోయింది. కొడుకు ఒక్కసారి వస్తే, వాడిని ఒక్కసారి చూసి కళ్ళు మూసేద్దామని వుంది. కాని వాడు రాలేదు. శేషమ్మకి ఆయాసం ఎక్కువైంది, ఆవేదన ఎక్కువైంది. ఈ బాధనుండి విముక్తి ప్రసాదించమని దేవుడికి మొక్కుకుంటోంది. చావు రాక, బ్రతక లేక నలిగే స్త్రీ జాతికి ప్రతీకగా గిజగిజ కొట్టు కుంటోందామె బ్రతుకు.

ఆర్థికంగా చితికిపోయి, అల్లాడిపోతోంది పార్వతి, ఇల్లు ఎక్కడా కుదరలేదు.

కనకాన్ని రోగిష్టి మొగుడు చితగ్గొడుతున్నాడు. కనకం అంతకంటే పెద్దగా అరుస్తుంది.

"సంసారం చెయ్యడానికి లేని బలం చావబాదటానికి వచ్చిందేం నీకు" అంటూ మొగుడి మీద విరుచుకు పడు తోంది. ఆ మొగుడు కూడా ఆమె దొరికినంత మేరకి పిడి గుద్దులు గుద్దుతున్నాడు. నోటి కొచ్చినట్లు తిడుతున్నాడు.

అంతా ఖాళీ చేసిన ఆ ఇంట్లో వాళ్ళ అరుపులు ప్రతిధ్వనిస్తున్నాయి.

ఆ ఉదయమే నరసింహం చెప్పా పెట్టకుండా గది ఖాళీ చేసి వెళ్ళిపోయాడు. ఆ ఉక్రోషం పట్టలేక కనకం అందర్నీ తిట్టిపోస్తుంది. రాత్రి దాకా గొడవ జరుగుతూనే వుంది. రోగిష్టి మొగుడు పెళ్ళాన్ని తీసుకుని బావమరిది దగ్గరకి బయలుదేరాడు. పాడు ముండని వదిలి పారేస్తానని శపథం చేసి, ఋణాల మీద సామాను సర్ది బండిలో వేశాడు. వెక్కిళ్ళ మధ్య సణుగుతూ కనకం బండి ఎక్కింది.

పక్క వీధిలో ఒక పాకలో గదిని మాట్లాడి వస్తే పార్వతమ్మ సామాను కట్టలు కట్టింది. కను చీకటి పడేవేళ కరంటు లేని పాకలోకి గాలికి గలగలలాడే తాటాకుల భయంకర శబ్దాల్లోకి - సర్దుకుపోవడమే జీవిత ధ్యేయంగా ఎరిగిన పార్వతమ్మ కదిలింది.

ఆ రోజు తెల్లవారింది.

పనివాళ్ళు యిల్లు పగలగొట్టడానికి వచ్చారు.

నిర్జీవంగా పడివున్న శేషమ్మని చూసి గతుక్కుమన్నారు. ఓనరుతో చెప్పి దిక్కులేని శేషమ్మకి అంతిమ యాత్ర ఏర్పాటు చేశారు.

దీనులు, హీనులు, దిక్కు మొక్కూ లేని ఎందరో స్త్రీల జాబితాలోంచి ఒక ప్రాణి నిష్క్రమించింది.

గూడు లేదని తెలిసి పక్షి గుట్టుగా ఎగిరిపోయింది.

("వనిత" మాసపత్రిక నుండి)